చేనేత.. ఎదురీత

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నేత కార్మికులు

వృత్తిని కోల్పోయి.. ఉపాధి లేక విలవిల

అప్పుల ఊబిలో దుబ్బాక చేనేత సొసైటీ 7

13 ఏళ్లుగా సహకార సంఘం ఎన్నికల్లేవ్

ఉద్యోగం భర్తది..

అర్చకత్వం చేసేది భార్య!

రాచన్నస్వామి ఆలయంలో ఇష్టారాజ్యం

కోహీర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బడంపేట గ్రామంలో ఉన్న రాచన్నస్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాలకవర్గం లేకపోవడంతో ఆలయ సిబ్బంది, అర్చకుల బృందం ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ముగ్గురు అర్చకులు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లు, ముగ్గురు స్వీపర్లు, ఇద్దరు నైట్ వాచ్‌మెన్‌లు పనిచేస్తున్నారు. పాలకమండలి పదవీకాలం సెప్టెంబర్ 31తో ముగియడంతో ఇక్కడి ఉద్యోగులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. అర్చకులు విధులకు డుమ్మా కొట్టి పెళ్లిళ్లు, పేరంటాలు చేయిస్తున్నారు. వీరి స్థానంలో భార్యలతో ఆలయంలో పూజలు చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భర్తలకు బదులు భార్యలు పూజారులుగా అవతారం ఎత్తడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సమర్పించిన కానుకలు, ఒడిబియ్యం, చీరలు తదితరాలు ఆలయానికి ఇవ్వకుండా అర్చకులు ఇంటికే తీసుకెళుతున్నారని ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసే మరి కొంతమంది ఉద్యోగులు భక్తులకు అందుబాటులో కాకుండా ఇతర ప్రాంతంలో నివాసం ఉంటూ తమకు అనుకూలమైన సమయంలో ఇక్కడికి వస్తు.. పోతూ నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో శివ రుద్రప్ప స్పందిస్తూ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బడంపేటలోని రాచన్నస్వామి ఆలయం

కేతకీ సంగమేశ్వరాలయంలో వసూళ్ల పర్వం

ఝరాసంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరాలయంలో అవినీతి, అక్రమాలపై భక్తులు దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డబ్బులిచ్చిన వారిని నేరుగా గర్భగుడిలోకి తీసుకువెళ్లి దర్శనం, అభిషేకం చేయిస్తున్నారని, స్వామివారి అభిషేకం సమయంలో గర్భగుడిలోకి అనుమతిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో, దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి వేచి ఉండవలసి వస్తుందని ఆరోపించారు. ఈ నెల 16న కుటుంబ సమేతంగా దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ఈ ఘటనలపై జిల్లా కేంద్రంలోని దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయ ఈవో, అర్చకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సహాయ కమిషనర్ ఆదేశాలమేరకు దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రంగారావు సోమవారం సాయంత్రం ఆలయంలో విచారణ జరిపినట్లు తెలిసింది.



దోమడుగు పొలంలో నిలిచిన కలుషిత జలాలు(ఫైల్)

కాలుష్య మడుగు..!

చెరువులు, పొలాల నిండా రంగు నీళ్లే

దోమడుగు గ్రామం విషపు రసాయన కాలుష్యంతో అల్లాడుతోంది. సమీపంలోని రసాయన పరిశ్రమలు వదిలిన వ్యర్థ జలాలు వర్షపు నీటితో కలిసి గ్రామానికి జీవనాధారమైన నల్లకుంట చెరువును పూర్తిగా కలుషితం చేశాయి. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు చెరువు నీరు ఎర్రబారి, పచ్చటి వరి పంట పొలాలను సైతం ముంచి నాశనం చేసింది. మనుషులు, మూగజీవాలు కూడా బతకలేని దుస్థితి ఏర్పడింది. కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకొని, చెరువును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజలు నెల రోజులుగా ర్యాలీలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేస్తున్నారు. అయినా స్థానిక అధికారులు, పీసీబీ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- అధికారులూ.. మా ఊరికి రండి
- కాలుష్యకారక పరిశ్రమలతో గ్రామం నిర్వీర్యం
- మనుషులు, మూగజీవులు బతకలేని పరిస్థితి
- పోరాటం చేస్తున్నా కన్నెత్తి చూడరా?
- పీసీబీ అధికారులపై ప్రజాగ్రహం



నల్లకుంట చెరువు

గుమ్మడిదల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామం కాలుష్యం కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నది. గ్రామానికి జీవనాధారంగా ఉన్న నల్లకుంట చెరువులోకి రసాయన పరిశ్రమలు వదిలిన వ్యర్థ జలాలు చేరడంతో కాలుష్య కాసారంగా మారింది. చెరువులోని రసాయన జలాలు చేరడంతో పంట పొలాలు పాడవుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట పొలాలు, చెరువులను నాశనం చేస్తున్న సమీపంలోని రసాయన పరిశ్రమలపై చర్యలు తీసుకొని చెరువును రక్షించాలని కోరుతూ నెలల రోజులుగా దోమడుగు గ్రామస్తులు ర్యాలీలు, రాస్తారోకోలతో ఉద్యమిస్తున్నారు. కనీసం అధికారులు స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. చెరువు నీరు కలుషితం కావడంతో మూగజీవాలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మేము గ్రామంలో ఎలా జీవించాలంటూ ప్రతిరోజు గ్రామస్థులు నిరసన వ్యక్తంచేస్తున్నారు. గ్రామస్థుల పోరాటాన్ని పట్టించుకోని మండల అధికారులు, కాలుష్యాన్ని కన్నెత్తి చూడని పీసీబీ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రజా ఉద్యమం ఇంత ఉధృతంగా కొనసాగుతునా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. 'అధికారులు మా గ్రామానికి రండి.. మా బాధలను చూడండి.. మానవత్వంతో స్పందించి ప్రజలు, మూగజీవాల ప్రాణాలను కాపాడండి.. అంటూ వేడుకుంటున్నారు. కాలుష్య జలాలతో నిండిన నల్లకుంట చెరువును పూర్తిస్థాయిలో శుద్ధిచేసి, పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం చేపట్టారు. ప్రజల పోరాటం పోలీసులకు సైతం తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు పీసీబీ అధికారులు దోమడుగు గ్రామాన్ని సందర్శించి, కాలుష్యకారక రసాయన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట కాలుష్య జలాలను పారబోసి నిరసన తెలుపుతున్న దోమడుగు గ్రామస్తులు

పీసీబీ అధికారిపై

కాలుష్య జలాలు..

పారబోసిన మహిళలు

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

సంగారెడ్డి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కారక పరిశ్రమలను మూసేయాలని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. దోమడుగు శివారులోని హెటెరో డ్రగ్స్-1 యూనిట్‌తో పాటు ఇతర రసాయన పరిశ్రమలను బంద్ చేయాలని కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. సమస్యను తెలుసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ప్రజావాణిలో ఉన్న కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) అధికారిని వారి వద్దకు పంపించారు. పీసీబీ అధికారి ఆందోళనకారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీబీ అధికారుల నిర్లక్ష్యం వల్లే రసాయన పరిశ్రమలు పంట పొలాల్లోకి కాలుష్య జలాలను వదులుతున్నాయని అన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తులైన మహిళలు కలుషిత జలాలను పీసీబీ అధికారి కుమార్ పాదాలపై చల్లడంతో ఉద్రిక్తత నెలకొంది. పీసీబీ అధికారి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం రైతులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

రైసు మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

కల్హేర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ రైసుమిల్లులో సోమవారం పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా సీఎంఆర్ సరఫరా చేయకుండా ప్రైవేటుగా విక్రయించిన ఈ మిల్లు పౌర సరఫరాలశాఖకు రూ. కోట్లల్లో బకాయిపడినట్లు తెలిసింది. సదరు రైసుమిల్లు యాజమాన్యం ప్రస్తుతం రైతులు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలుచేసి సీఎంఆర్ లోటును భర్తీచేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రికార్డులను పరిశీలించారు. మిల్లుకు ధాన్యం విక్రయించిన రైతులను విచారించారు. క్రిష్ణాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో, మండలంలోని ఇతర రైసుమిల్లుల్లోనూ రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది.

తారా కాలేజీలో 'పీజీ స్పాట్'

సంగారెడ్డి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 9 పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 న అడ్మిషన్ పొందేందుకు చివరి గడువు అని తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్ ఫొటోలతో మంగళవారం ఉదయం 10 గంటల వరకు కాలేజీలో సంప్రదించాలని కోరారు.



జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి

నేటి నుంచి 20 వరకు

జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్

నారాయణఖేడ్‌లో నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

నారాయణఖేడ్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించడానికి నారాయణఖేడ్‌లో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి 20 వరకు ఖేడ్ పట్టణ శివార్లలోను తక్షిలా పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన నిర్వహించనున్నారు. నేడు ప్రారంభోత్సవానికి ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, సబ్‌కలెక్టర్ ఉమాహారతి, డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొననున్నారు. ప్రదర్శనలో 129 ప్రాజెక్టులకు సంబంధించి 700 మంది విద్యార్థులు వరకు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగంలో 9, 10, ఇంటర్ విద్యార్థులు పాల్గొనున్నారు. బీఈడీ, డైట్ శిక్షణ విద్యార్థుల బోధనాభ్యాసన సామగ్రిని కూడా ప్రదర్శిస్తారు. ముగింపు కార్యక్రమానికి వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతారని అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వసతి, సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తెలిపారు. స్థాయిసైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ లింబాద్రి, ఎంఈవోలు విశ్వనాథ్, మన్మథకిషోర్, నాగారం శ్రీనివాస్, రాములు, రాజశేఖర్, పీజీ హెచ్ఎంలు నర్సింహులు, పండరి, గోపాల్, యాదవరెడ్డి, ఇన్‌చార్జీలు రమేష్, భాస్కర్, చంద్రశేఖర్, తక్షిలా పాఠశాల కరస్పాండెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

చలి @7.1

కోహీర్‌లో రికార్డు

- ఉమ్మడి జిల్లాలో 33 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్..
- నవంబరులోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న పల్లెలు



కోహీర్‌లో చలి మంట వద్ద యువకులు

కోహీర్/మెదక్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలకు తోడు చలిగాలుల తీవ్రతకు పల్లెలు వణుకుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో సోమవారం 7.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలోని బేగంపేట్‌లో 8.6 డిగ్రీలు, మెదక్ జిల్లా నార్లాపూర్‌లో 9.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 33 ప్రాంతాల్లో సోమవారం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది ఇదే రోజున కోహీర్‌లో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. ఈసారి రికార్డు బద్దలైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రత వివరాలు..

సంగారెడ్డి జిల్లా సదాశివపేట 7.9, న్యాల్‌కల్ 8, ఝరాసంగం 8.1, మొగుడంపల్లి 8.2, నల్లవల్లి 8.8, అల్గోల్ 8.6, సత్వార్ 8.6, మల్‌చేల్మ 9.1, దిగ్వాల్ 9.3, కడ్పల్ 9.5, జహీరాబాద్ 9.5, పుల్కల్ 9.8, కంగ్టి 9.8, నిజాంపేట్ 9.9, రాయికోడ్ 10.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో నార్లాపూర్ 9.3, సర్దన 9.3,, వాడి 9.3, దామరంచ 9.4, వెల్దుర్తి, హవేళీఘణపురం 9.5, నాగపూర్ 9.6, రామాయంపేట 9.7, మనోహరాబాద్ 9.7, కాగజ్ మద్దూర్ 9.7, దొంగల ధర్మారం 9.7, కొల్చారం 9.9, శివనూరులో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో 8.3, బేగంపేట 8.6, అక్బర్‌పేట-భూంపల్లి, పోతిరెడ్డిపేట 8.8, మార్కుక్, అబ్సిపూర్ 9.2, అంగడి కిష్టాపూర్ 9.4, కొండపాక 9.5, నంగనూర్ 9.8, వర్గల్, గౌరారం 9.9, మునిగడప 10.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మూడు రోజులు చలిగాలులు

ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న చలిగాలులు మరో మూడు రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు కమ్మేస్తున్నది. వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక లైట్లు వేసుకుని నడుపుతున్నాయిరు. రైతులు, పాలవ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్వెటర్లు, జర్కిన్లు, మంకీ క్యాప్‌లు ధరించనిదే ఇళ్ల నుంచి కదలడంలేదు. వృద్ధులు, మహిళలు చలిగాలులకు తట్టుకోలేకపోతున్నారు.

'మత్తు' మందులపై ఉక్కుపాదం

విచక్షణారహితంగా ఔషధాలు విక్రయిస్తే లైసెన్సు రద్దు


జిల్లా ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాము



ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాము

సంగారెడ్డి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్తు కలిగించే మందుల తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని సంగారెడ్డి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాము హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మసీల్లో మత్తును కలిగించే మందులు, అబార్షన్ పిల్స్ అమ్మకాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. గత ఏడాది రూ.14 కోట్ల విలువైన మత్తు మందు తయారీ ముడిపదార్థాలను సీజ్ చేసినట్టు తెలిపారు. పాశమైలారంలో ఓ కంపెనీ, ఆర్‌సీపురంలో ఫార్మసీ లైసెన్సులను రద్దు చేసినట్టు తెలిపారు. అనధికారంగా మందులు నిల్వచేసిన 15 మంది ఆర్ఎంపీలపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి టీజీన్యాబ్, పోలీసులు సహకారంతో 870 తనిఖీలు చేశామని పేర్కొన్నారు. 168 మందిపై కేసులు నమోదు చేయగా, 166 వాటిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. 152 రకాల మందులను శాంపిళ్లుగా సేకరించామని, ఇందులో ఒకటి నాణ్యత లేదని తేలిందన్నారు. మత్తు మందుల దందాను అరికట్టేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతీ వినియోగదారుడు ఫార్మసీలో మందులు కొనుగోలు చేసే క్రమంలో బిల్ తీసుకోవాలని, గడువు తేదీ సరిచూసుకోవాలని సూచించారు.





ఆలయాలకు కార్తీక శోభ

కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. మహిళలు శివాలయాలకు తరలివచ్చి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సంగారెడ్డి పట్టణ పరిధి పోతిరెడ్డిపల్లిలోని సంగమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు.

-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

సమ్మెబాటలో జిన్నింగ్ మిల్లులు

సంగారెడ్డి జిల్లాలో నిలిచిన పత్తి కొనుగోళ్లు

సీసీఐ పాత విధానమే అమలు చేయాలని డిమాండ్

మునిపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తీసుకువచ్చిన కొత్త నిబంధనలను ఎత్తివేసి పాత విధానాన్నే పునరుద్ధరించాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు సోమవారం నుంచి ఆందోళనబాటపట్టారు. దీంతో సంగారెడ్డి జిల్లాలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. మిల్లుల యజమానులు సమ్మె చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ ఎప్పుడనేది పూర్తిగా తెలియకపోవడంతో ఇప్పటికే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ చేసుకున్న రైతులు మిల్లులకు పత్తిని తీసుకువెళ్లారు. కానీ కొనుగోళ్లు నిలిచిపోవడంతో వాహనాలతో మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వాహనాల యజమానులు వెయిటింగ్‌చార్జీలు అడుగుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిద్దామంటే క్వింటాలుకు రూ.6,800 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. మరోవైపు ఇప్పటికే కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు క్యాన్సల్ చేసుకుందామంటే ఎలాగో అర్థంకాక ఇబ్బందిపడుతున్నారు.



వడ్ల కుప్పను ఢీకొన్న ఆటో..
బోల్తాపడి డ్రైవర్ మృతి

● రైతుపై కేసు నమోదు


అహ్మద్ హుస్సేన్ మృతదేహం

అల్లాదుర్గం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఆటో ఢీకొని బోల్తా పడటంతో డ్రైవర్ మృతిచెందిన సంఘన ఆది వారం రాత్రి మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంక రంపేట మండలం కోలపల్లికి చెందిన అహ్మద్ హుస్సేన్(57) ఆటో నడి పిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం కొందరు ప్రయా ణికులను అల్లాదుర్గంలోని రేణుకామాత ఆలయానికి తీసుకువచ్చి తిరిగి పెద్దశంకరంపేట వైపు రాత్రి వేళలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలం లోని రాంపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ధాన్యం కుప్పను ఆటో ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ అహ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతిచెందాడు. అహ్మద్ హుస్సేన్ కుమారుడు మహ్మద్ జావిద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. నిర్లక్ష్యంగా రోడ్డుపై ధాన్యం నిల్వ ఉంచిన రాంపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని రైతు..


మన్నె భిక్షపతి(ఫైల్)

ములుగు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మట్టిలోడ్‌తో వస్తున్న టిప్పర్ ద్విచక్రవాహ నాన్ని ఢీకొనడంతో దీనిపై ఉన్న రైతు మృతి చెందిన సంఘటన ములుగు మండల పరి ధిలోని బస్వాపూర్ - కొక్కొండ రోడ్డులో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన రైతు మన్నె భిక్షపతి(58) సోమవారం ఉదయం వ్యవ సాయ పనుల నిమిత్తం తన టీవీఎస్ ద్విచక్ర వాహనంపై కొక్కొండ గ్రామానికి బయలుదేరాడు. బస్వాపూర్-కొక్కొండ రోడ్డులో మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్రవా హనాన్ని ఢీకొనడంతో భిక్షపతి సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. భిక్ష పతికి భార్య అంజమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించినట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

అప్పుల బాధతో పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య


మాదారం ఎల్లం(ఫైల్)

చేగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక పారిశుధ్య కార్మి కుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండల పరిధిలోని పెద్ద శివనూర్ గ్రామంలో సోమ వారం చోటుచేసుకుంది. ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మాదారం ఎల్లం(45) వ్యవసాయం చేసుకుంటూనే, పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఎల్లం చెయ్యి విరిగిపోయింది. డబ్బులు లేక ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఇంటి కోసం చేసిన అప్పు తీర్చేలేకపోయాడు. మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లంకు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

దొంగతనం నెపం మోపారని మేకల కాపరి..

జోగిపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం నెపం మోపారని ఆత్మహత్యాయత్నం చేసిన మేకల కాపరి చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామంలో చేటుచేసుకున్నది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల మేరకు.. తాలేల్మ గ్రామానికి చెందిన కుమ్మరి జోగయ్య(45) మూడేళ్లుగా డాకూరులోని నర్సింహారెడ్డి వద్ద మేకలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, జోగయ్యపై మేకలను దొంగలించాడని ఆరోపిస్తూ గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తనపై అకారణంగా నేరం మోపారని, మనస్తాపానికి గురై నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జోగయ్య సోమవారం మృతిచెందాడు. భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

దుబాయ్‌లో ఆకునూరు వాసి మృతి


షేక్ మదర్(ఫైల్)

చేర్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో గుండెపోటుతో మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం ఆకునూరు గ్రామ శివారు కాశెగుడిసెలుకు చెందిన షేక్ మదర్(32) పదేళ్లుగా దుబాయ్‌లో కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందాడు. కొద్ది రోజుల క్రితం అక్కడే గుండెనొప్పి రావడంతో ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

327 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు ఘటనల్లో మొత్తం 327 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. పౌరసరఫరాల విభాగం ఉప తహసీల్దార్ అనూప్ దేవానంద్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పరిధి ఇస్నాపూర్ నుంచి జహీరాబాద్ వైపునకు రేషన్ బియ్యం తీసుకుని వెళ్తున్న లారీని రామచంద్రపురం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఈ లారీలో మొత్తం 75 బస్తాల్లో 290 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండగా, పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో డ్రైవర్ నీరాబాయిపై కేసు నమోదు చేశారు. మరోఘటనలో ఐడీ ఏబొల్లారం జ్యోతినగర్ నుంచి 80 బస్తాల్లో 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా, స్థానికులు పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోను పట్టుకుని బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఆటోను స్వాధీనం చేసుకుని డ్రైవర్ రాజు, ఆటో యజమాని జైపాలలపై కేసు నమోదు చేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి


ఇందిరాబాయి (ఫైల్)

అల్లాదుర్గం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గంలో ఓ శతాధిక వృదురాలు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పట్టణానికి చెందిన తాండ్లే ఇందిరాబాయి (103) వారం రోజులుగా అస్వస్థకు గురి కాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహింప చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఇందిరాబాయికి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి పూజలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కొత్తబస్టాండ్ సమీపంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీచంద్ర సోమవారం పూజలు చేశారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలోని శివ లింగానికి ఆమె అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపం వెలిగించారు. కార్తీకమాసం చివరి సోమవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు మఠం శివకాంత్ స్వామి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి.


అభిషేకం చేస్తున్న ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర

వృద్ధులను చిన్నచూపు చూడొద్దు

● సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల పట్ల చిన్నచూపు ధోరణి అవలంబించకుండా, వారి బాగోగులు పట్టించుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని గ్రేస్ వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. న్యాయపరమైన విషయాలో ఏమైనా సలహాలు, సూచనలు అవవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మెదక్ సీఎస్ఐలో 'గంట' ప్యానల్ విజయం


గంట సంపత్

మెదక్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ మహాలయ చర్చి (సీఎస్ఐ) కోశాధికారి పోస్టు కోసం జరిగిన ఎన్నికల్లో గంట సంపత్ ప్యానెల్ ఘన విజయం సాధించడంతో సోమవారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం మూడు ప్యానెళ్లు పోటీ చేశాయి. మూడు ప్యానళ్లలో 60 మంది సభ్యులు పోటీ చేయగా గంట సంపత్ ప్యానెల్ 20 సభ్యులకుగాను 13 మంది సభ్యులు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కోశాధికారిగా విజయం సాధించిన గంట సంపత్ మాట్లాడుతూ విశ్వాసులకు సమాన హక్కులు, చర్చి ఆస్తుల పరిరక్షణ, పారదర్శకతతో కూడిన పరిపాలన లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

సంయుక్త బృందాల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పంటల సందర్శన

చేగుంట, నంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుక్మాపూర్‌లో సంయుక్త బృందాల క్షేత్ర స్థాయి అధికారుల కమిటీ పంటపొలాలను సోమవారం సందర్శించారు. ఈ కమిటీ పంటలను పెరుగుదల దశ, చీడపీడల ప్రభావం, వరిలో పిలకల సంఖ్య, ప్రభావం చూపే కీలక అంశాలను పరిశీలించారు. కమిటీ బృందం నమూనాలను సేకరించింది. రైతుల ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. పరిశీలించిన వారిలో డీఏవోతో పాటు విత్తనశుద్ధి సంస్థ సహాయ సంచాలకులు ఎంశివకుమార్, విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ అతుల్ కుమార్‌జైన్, సహాయ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, రైతు విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, తదితరులు ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న సంయుక్త బృందం

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పది మంది ఎంపిక

మెదక్ అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని గుల్షన్ క్లబ్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-19 బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో 30 మంది క్రీడాకారులు పాల్గొనగా 10 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ సంఘం కార్యదర్శి డా.ప్రభుకుమార్ తెలిపారు. విజేతలకు మాజీ ఏఎంసీ ఛైర్మన్ మధుసూదన్ రావు బహుమతులు అందజేశారు. క్లబ్ సభ్యులు, పీడీ ఆనందం, హనుమంతు, వినోద్‌కుమార్, కోచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట ఫంక్షన్‌హాల్‌లో చోరీ

● సౌండ్ బాక్స్‌లు, సీసీ కెమెరాలు అపహరణ

నిజాంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శుభకార్యాలు నిర్వహించుకునే ఫంక్షన్‌హాల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. ఫంక్షన్‌హాల్ యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రేణుకామాత ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.2 లక్షల విలువైన సౌండ్‌బాక్స్‌లు, సీసీ కెమెరాలను దొంగిలించారు. వారం రోజుల్లో రెండుసార్లు చోరీ జరిగింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

హుస్నాబాద్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో..

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగింది. పట్టణానికి చెందిన చీకోటి ప్రభాకర్ నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లో ఉన్న అర్థతులం బంగారం, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత.. ఎదురీత

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నేత కార్మికులు



- వృత్తిని కోల్పోయి.. ఉపాధి లేక విలవిల
- ఇంకా మూస పద్ధతుల్లోనే పరిశ్రమ
- కొత్త ఒరవడికి అందని ప్రోత్సాహం
- అప్పుల ఊబిలో దుబ్బాక చేనేత సొసైటీ
- 13 ఏళ్లుగా సహకార సంఘం ఎన్నికల్లేవ్

దుబ్బాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి మార్కెట్ పోటీ ప్రపంచంలో దేశీయ చేనేత ఉత్పత్తులు మూలన పడుతున్నాయి. దేశీయ వస్త్ర రంగంలో మంచి ఆదరణ ఉన్నప్పటికీ, మార్కెటింగ్‌కు అనుగుణంగా ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోలేకపోవడంతో చేనేత రంగం చిన్నచూపునకు గురవుతోంది. సిద్దిపేట జిల్లాలో మొత్తం 18 చేనేత సహకార సంఘాలు ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అందులో దుబ్బాక చేనేత సహకార సంఘం దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

ఎన్నికలు లేక స్తంభించిన ప్రగతి

చేనేత సహకార సంఘాలకు 13 ఏళ్లుగా (2013 నుంచి) ఎన్నికలు జరగకపోవడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. విధాన నిర్ణయాలు తీసుకునే పాలక మండలి లేకపోవడంతో సహకార సంఘాల పాలన అంతగా అవగాహన లేని అధికారుల చేతుల్లోనే కొనసాగుతోంది. ఆ అధికారులకు కీలక నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు లేకపోవడంతో మార్కెట్‌ను అందుకోలేకపోతోంది. గిరిగీసిన గీతలోనే నేతన్న మెదలాల్సిన పరిస్థితి నెలకొంది.


దుబ్బాక చేనేత సహకార సంఘం భవనం

వేతనంలో జాప్యం..

పాలకమండలి లేకపోవడంతో నాలుగేళ్లుగా నేత కార్మికుల వేతనాలపై అధికారుల నిర్ణయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాలన్నా జాప్యం తప్పడంలేదు. దుబ్బాక చేనేత సహకార సంఘంలో నేసిన టీసీ షర్టింగ్‌కు టెస్కో మీటరుకు రూ.36 చెల్లిస్తుంది. రోజుకు కేవలం 8 మీటర్లు మాత్రమే నేత కార్మికుడు నేయగలుగుతాడు. ఇందులో నుంచి అధికారులు కేవలం రూ.200 మాత్రమే చెల్లించగలుగుతారు. కార్మికుడికి ఈ దినసరి వేతనం కూడా సక్రమంగా అందడం లేదు.


రాట్నంపై కండెలు చుడుతున్న మహిళలు

వృత్తికి దూరమవుతున్న యువతరం

నాలుగు దశాబ్దాల క్రితం దుబ్బాకలోనే సుమారు 15 వేల మంది కార్మికులు జీవనోపాధి పొందేవారు. ఇప్పుడు సహకార సంఘంలో 1600 మంది సభ్యులు ఉంటే, వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు 200 మంది మాత్రమే ఉన్నారు. అందులో 188 మంది 60 ఏళ్ల లోపు వారే. అంటే కొత్తతరం చేనేత వృత్తికి రావడంలేదు. ప్రోత్సాహం లేకపోవడం వల్ల జిల్లాలో 2017-24 మధ్యలో కేవలం ఏడుగురు మాత్రమే వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. ప్రస్తుతం కేవలం 57 మంది మాత్రమే రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రాంతం చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ లేకపోవడానికి గల కారణాలను ప్రభుత్వం గుర్తించి, పరిశ్రమలకు తక్షణమే జీవం పోయాలని నేతన్నలు కోరుతున్నారు.

నూతన పద్ధతులకు నోచుకోని మగ్గాలు

మూసపద్ధతులు వీడి, విధాన నిర్ణయాలు తీసుకునేవారు లేకపోవడంతో మార్కెట్‌కు అనుకూలంగా వస్త్రాలను తయారు చేసే ప్రోత్సాహం కరువైంది. గతంలో అధునాతన లినిన్ వస్త్రాలను నేసింది. కానీ పాలకమండలి లేకపోవడంతో అధికారులు పాతపద్ధతిలోనే వస్త్రాలను నేయాల్సి వస్తుంది. పాతపద్ధతిలో ఒక మగ్గం పంచ్‌కార్డు, వార్నిస్ కట్టడం మార్చాలంటే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. దీనికి 15 రోజులు పడుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి ఎలక్ట్రానిక్ జకార్డ్ వినియోగంలోకి రావాలి. దీని ద్వారా పెన్‌డ్రైవ్‌తో డిజైన్ మార్చవచ్చు. సుమారు రూ.8 లక్షలు అయ్యే ఈ ఖర్చులో కేంద్ర ప్రభుత్వం హెచ్‌హెచ్ఎస్ (హస్తకర్గ సమ్రద్దన్ సహాయత) ద్వారా 90 శాతం అందిస్తుంది. మిగతా 10 శాతం కార్మికులు చెల్లించాల్సి ఉంటుంది. కార్మికులు అంత మొత్తం చెల్లించలేని పరిస్థితిలో.. పాలకమండలి ఉంటే రుణాన్ని సమకూర్చి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే బాగుంటుందని జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా పాలకమండలి లేకపోవడంతో ఆ ప్రతిపాదనలు అలాగే మిగిలాయి. జిల్లాలో పది జకార్డ్‌లను (960 హుక్స్ ఉండే) ప్రతిపాదించారు. ఇది టైఅండ్‌డై కావడంతో ప్రాసెసింగ్‌తో కూడా అవసరం ఉండదు. డిజైన్ మార్చడానికి పంచ్‌కార్డు అవసరం ఉండదు. దీని వల్ల రూ. 40 వేల వరకు ఖర్చు ఆదా అవుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇలాంటి అధునాతన పద్ధతులను అందిపుచ్చుకునే అవకాశం లేకుండా పోయింది.

రుణ ఊబిలో దుబ్బాక సహకార సంఘం

దుబ్బాక అంటే గతంలో ఆత్మహత్యలు, ఆకలిచావులతో తల్లడిల్లిన చేనేతల బతుకులు గుర్తొస్తాయి. బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వైనం కనిపిస్తుంది. ఈ పరిస్థితిని చూసిన అప్పటి రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావు 2018లో దుబ్బాక చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం షూరిటీపై రుణం అందిస్తామని హామీ ఇచ్చారు. అధునాతనమైన లినిన్ వస్త్రాలను మార్కెట్‌లోకి తెచ్చేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.2 కోట్ల రుణం అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా 2019లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ద్వారా రూ.52 లక్షలు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సీ) నుంచి పొందారు. అయితే, మిగతా రుణం కోసం ప్రయత్నించగా, ఎస్ఎఫ్‌సీ అధికారులు దుబ్బాక చేనేత సొసైటీ పేరుతో డీసీసీ బ్యాంకులో రూ.42 లక్షలు, ఎస్‌బీఐ రూ.9 లక్షలు ఉన్నాయని, వాటిని చెల్లిస్తేనే కానీ రుణం ఇవ్వమబోమని నిరాకరించారు. దీంతో వచ్చిన రూ.52 లక్షల రుణం బకాయిల చెల్లింపుకే సరిపోయింది. 2019 దుబ్బాక ఉప ఎన్నికల తర్వాత ప్రభుత్వం దుబ్బాకపై శీతకన్ను వేయడంతో ఎస్ఎఫ్‌సీ నుంచి మరింత సహకారం అందలేదు. తీసుకున్న రుణంపై వడ్డీ పెరిగి రూ.1 కోటి 10 లక్షలుగా పేరుకుపోయింది. అంతేగాక సిద్దిపేట ప్రాజెక్టు సొసైటీలో రూ.17 లక్షలు, ఇర్కోడు సొసైటీలో రూ.22 లక్షలు బకాయిలు ఉండటంతో.. నూతన పెట్టుబడి పెట్టి సంఘాలను బలోపేతం చేయాలనుకున్నా రుణం పుట్టడంలేదు. గతంలో ప్రభుత్వాలు రుణాలను మాఫీ చేస్తామన్న హామీ కూడా అమలుకాలేదు. దీంతో దుబ్బాక సొసైటీ ఆదాయం లేక, బకాయిలు చెల్లించలేక దీనవస్థలో ఉంది.

చేనేతలకు సహకారం అందించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాస్కర్



కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత బోర్డు, హ్యాండిక్రాఫ్ట్ బోర్డు, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్, హౌస్ కమ్ వర్క్ షెడ్ వంటి పథకాలను రద్దు చేసింది. కేంద్రం ముడి సరుకులైన రంగులు, రసాయనాలతో పాటు చేనేత చీరలపై జీఎస్టీ విధించి చేనేత పరిశ్రమను చావు దెబ్బ తీసింది. రద్దు చేసిన పథకాలను తిరిగి పునరుద్ధరించాలి. ముడి సరుకులు, వస్త్రాలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేసి చేనేత కళను, పరిశ్రమను ఆదుకొని, కార్మికులకు ఉపాధి కల్పించాలి.

సమస్యల వాణి

మా సమస్యలు తీర్చండి అంటూ బాధితులు ప్రజావాణిలో తమ గోడు వినిపించారు. సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య, మెదక్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేటలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సంగారెడ్డి, మెదక్‌లలో జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలోనూ ప్రజావాణి జరిగింది.

మెదక్‌లో 76 అర్జీలు.. సంగారెడ్డిలో 25, సిద్దిపేటలో 160

సంగారెడ్డి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని మొత్తం 25 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పట్టాభూములు ప్రభుత్వ భూములుగా..

గుమ్మడిదల: మండలంలోని అనంతారం గ్రామ సర్వే నంబర్ 173, 174 పట్టాభూములను ప్రభుత్వ భూములుగా నమోదు చేశారని బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. అధికారులు అవగాహన లేకుండా తీసుకున్న నిర్ణయాలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు.


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పారదర్శక పాలన కోసమే..

మెదక్ అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పారదర్శక పాలనే కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 96 అర్జీలు వచ్చాయి. అందులో భూభారతికి సంబంధించి 37, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 8, పింఛన్లు 7, ఇతర 35 దరఖాస్తులు ఉన్నాయి. అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో.. భారీగా అర్జీదారులు

సిద్దిపేట నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 160 అర్జీలు వచ్చాయి. వీటిని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ స్వీకరించారు. ఎక్కువగా భూ సమస్యలు, ఇళ్లు, పింఛన్ల దరఖాస్తులు వచ్చాయి. డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీల ఆధ్వర్యంలో..

సంగారెడ్డి క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకని పక్షంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజావాణి సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

మెదక్ అర్బన్: పోలీస్ ప్రజావాణిలో భాగంగా మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. 9 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.

అక్కాచెల్లెళ్లపై అలిగి సోదరుడి అదృశ్యం

పటాన్‌చెరు నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గృహప్రవేశం జరిగిన మరుసటి రోజు అక్కాచెల్లెళ్లపై అలిగి సోదరుడు అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగిలో నివాసం ఉంటున్న రామచందర్‌రావు ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. ఈనెల 15న గృహప్రవేశం చేసుకున్నారు. 16వ తేదీన తన అక్కాచెల్లెళ్లకు సరైన మర్యాద జరగలేదంటూ రామచందర్‌రావుతో గొడవ జరిగింది. దీనిపై అలిగి స్కూటీ నడుపుకుంటూ బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. భార్య సంతోషి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అన్న మందలించాడని చెల్లి..


గాయత్రీ కుమారి(ఫైల్)

పటాన్‌చెరు నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అబ్బాయిలతో ఫోన్‌లో ఎందుకు మాట్లాడుతున్నావంటూ అన్న మందలించినందుకు చెల్లి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు జేపీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గాయత్రీకుమారి(20) మెహదీపట్నం ఫుల్లారెడ్డి కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. కొన్ని రోజులుగా అబ్బాయితో ఎక్కువగా ఫోన్ ఎందుకు మాట్లాడుతున్నావంటూ అన్న మేఘనాథరాం తీవ్రంగా మందలించారు. దీనిపై ఆగ్రహించి ఫోన్‌లో సిమ్ కార్డు ఇంట్లోనే వదిలి ఈనెల 15వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించలేదు. అన్న మేఘనాథరాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఈసారి ఉత్సవ కమిటీతో కాలక్షేపమేనా?

● మల్లన్న ఆలయ కమిటీ నియామకానికి గ్రహణం
● చైర్మన్ లేకుండానే మళ్లీ బ్రహ్మోత్సవాలా?

కొమురవెల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయానికి పూర్తిస్థాయి పాలక మండలి నియామకానికి గ్రహణం వీడడం లేదు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతూ, సంవత్సరానికి సుమారు రూ.22 కోట్ల ఆదాయం కలిగి ఉన్నా.. పూర్తిస్థాయి పాలకమండలిని నియమించకపోవడం పట్ల కాంగ్రెస్ నాయకులు నిరాశకు లోనవుతున్నారు.

పూర్తిస్థాయి పాలకవర్గం కొలువుదీరేనా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మొదటిసారి 20 మందితో పునరుద్ధరణ కమిటీని ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ కమిటీ పదవీ కాలం గత సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన ముగిసింది. ఆ తర్వాత రెగ్యులర్ కమిటీ కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తుల గడువును పొడిగించగా, 82 మంది ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, చైర్మన్ లేకుండా కేవలం ఎనిమిది మందితో ఒక సంవత్సరం పాటు కొనసాగే రెగ్యులర్ కమిటీని ప్రభుత్వం నియమించింది. వాస్తవానికి ప్రధానార్చకుడిని కలుపుకుని 15 మందితో కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా, ప్రధానార్చకుడిని ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కలుపుకుని ఎనిమిది మందితోనే పాలకమండలిని ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ సారైనా చైర్మన్‌తో కూడిన పూర్తిస్థాయి పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తారా అని పలువురు చర్చించుకుంటున్నారు. వచ్చే నెల 14న కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో ఇప్పుడున్న వారినే కొనసాగిస్తూ జీవో విడుదల చేస్తారా, లేక నూతనంగా పాలకవర్గాన్ని నియమిస్తారా అనేది వేచి చూడాలి. ఈ విషయంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల్లోనే నిరాశ వ్యక్తమవుతోంది.



అభివృద్ధి పనుల్లో అలసత్వం

ఆలయానికి చైర్మన్‌తో కూడిన పూర్తిస్థాయి పాలకవర్గం లేకపోవడంతో ఆలయాభివృద్ధి పనులు ఏళ్లుగా మందకొడిగా సాగుతున్నాయి. ఆలయానికి సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఒక్కొక్కరూ రెండు, మూడు విభాగాలకు ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇటు పాలకవర్గం లేకపోవడం, అటు సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల ఆలయ అభివృద్ధి కుంటుపడుతోంది. మరో నెల రోజుల్లో స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాలకవర్గం కొలువుదీరేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అమ్మవార్ల స్వర్ణ కిరీటాలు కల్యాణం నాటికైనా అందేనా?

గత ప్రభుత్వ హయాంలో అమ్మవార్లకు స్వర్ణ కిరీటాలు తయారు చేయిస్తామని అప్పటి మంత్రులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం మారిన తర్వాత ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా అమ్మవార్లు మేడలమ్మ, గొల్లకేతమ్మకు బంగారు కిరీటాలు తయారు చేయిస్తామని తెలిపారు. అయితే, ఇప్పటివరకు స్వర్ణ కిరీటాల తయారీపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వచ్చే నెల 14న జరగనున్న మల్లన్న కల్యాణం నాటికైనా అమ్మవార్లకు స్వర్ణ కిరీటాల ధారణ జరిగేలా చూడాలని, ఈ విషయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



యజమాని మరణిస్తే రూ.20 వేలు

● జాతీయ కుటుంబ ప్రయోజన పథకంతో భరోసా

తెలుసుకుందాం

అక్కన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి కొంచెం సాయంగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకంను ప్రారంభించింది. ఇది మొదలై ఎనిమిదేళ్లు కావస్తున్నా బాధిత కుటుంబాలకు అవగాహన లేకపోవడంతో సాయం కోసం దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారు.

ఈ పథకం ఎవరికి ఉపయోగం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబంలోని పెద్ద చనిపోతే సంబంధిత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుంటే రూ.20 వేల సహాయం అందుతుంది. కుటుంబంలోని వితంతు, అవివాహ కుమార్తెకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. కుటుంబ పెద్ద 18-60 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి, సాధారణ, ప్రమాదవశాత్తు మృతి చెందితే, మృతిచెందిన రెండేళ్లలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలి.

ఇలా దరఖాస్తు చేయాలి

ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి మృతిచెందిన వ్యక్తి సంబంధీకులు వారి కుల ధృవీకరణ పత్రం, ఆదాయం రూ.60 వేలకు మించకుండా ఉండాలి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతా తీసుకెళ్లి మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలి. అట్టి దరఖాస్తులను పైఅధికారులకు పంపిస్తే పరిశీలన అనంతరం లబ్ధిదారుల ఖాతాలోకి రూ.20 వేలు జమచేస్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్తం

సంపూర్ణ అక్షరాస్యత అమలుకు కృషి

మనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో సంపూర్ణ అక్షరాస్యత అమలు కోసం కృషి చేస్తున్నట్లు అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మనూరు ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన అక్షరాస్యత అమలు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మనూరు మండలం డ్వాక్రా సంఘాలలో 1602 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామని, వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం అంత్య, సీఆర్పీలు సునీత, మండల సమైఖ్య అధ్యక్షురాలు మీనా, సీసీలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

హవేళిఘణపూర్, నవంబరు 18;(ఆంధ్రజ్యోతి); మండలంలెపి ముత్తాయికోట(మదుల్వాయి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ గుండారం రాంచంద్ర గౌడ్ (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజల సమస్యలు తీరుస్తూ ఆయన నిరంతరం గ్రామాభివృద్ధికి కృషి చేశాడని గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. కాగా మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు కిరణ్ గౌడ్ గతంలో సర్పంచ్‌గా సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి రామచంద్రగౌడ్ మృతికి సంతాపం ప్రకటించారు.

జంగరాయి సహకార సంఘం డైరెక్టర్ కన్నుమూత

చిన్నశంకరంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగరాయి సహకార సంఘం డైరెక్టర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మినిపూరి సిద్దిరెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. డైరెక్టర్ సిద్దిరెడ్డి మృతితో గ్రామంలోని విషాదం నెలకొంది. ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం ప్రకటించారు. అంత్యక్రియల్లో పలువురు రాజకీయ నాయకులు, ఆయా గ్రామాల సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే కృషి

తూప్రాన్/చిన్నశంకరంపేట/చేగుంట, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పనిచేస్తుందని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి అన్నారు. సోమవారం తూప్రాన్, చిన్నశంకరంపేట, చేగుంట మండలాల్లోని టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం నిరంతర పోరాటం చేస్తుందన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు చేశారు.

బీవీఆర్ఐటీలో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నర్సాపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండి మంచి పుస్తకాలు పఠనం చేసినప్పుడు విద్యార్థులు వారి చదువుతో పాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందుతారని బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ కె.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో గ్రంథాలయాల ఉపయోగంతో పాటు డిజిటల్ యుగంలో పుస్తకాల ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మల్లిఖార్జున్, హెచ్‌వోడీలు రాయుడు, మధుబాబు, మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్ ఉన్నారు.

స్వర్ణనిధిని సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):డిపాజిట్ దారుల సౌలభ్యం కోసం స్వర్ణ నిధి డిపాజిట్ పథకాన్ని తీసుకువచ్చామని స్థానిక డీసీసీ బ్యాంకు మేనేజర్ కిషన్ అన్నారు. డిపాజిట్ల సేకరణ మాసోత్సవం సందర్భంగా సోమవారం స్వర్ణనిధి డిపాజిట్ కరపత్రాలను ఆవిష్కరించారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు ఇస్తున్నామన్నారు.

పారిశ్రామికవాడలో పడకేసిన పారిశుధ్యం

- ఐడీఏబొల్లారం పురపాలక పరిధిలో లోపించిన పారిశుధ్యం
- పూర్తిస్థాయి విధులకు హాజరుకాని 27 మంది పారిశుధ్య కార్మికులు
- మూలన పడిన చెత్త సేకరణ రిక్షాలు
- బస్తీల మధ్యన మురుగునీటి కుంటలు
- కంపుకొడుతున్న పరిసరాలతో వ్యాధుల బారిన కార్మికుల కుటుంబాలు



మురికి కూపంగా మారిన కుంట, కుంటలోకి చేరిన వ్యర్థాలు

ఐడీఏబొల్లారం నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మినీ ఇండియాగా పిలుచుకునే ఐడీఏబొల్లారం పురపాలక పరిధిలో స్థానికుల ఆరోగ్య రక్షణ ప్రమాదంలో పడింది. పరిసరాల శుభ్రతే ఆరోగ్యానికి రక్ష అంటూ అధికారులు చేసే ప్రచారం ఆచరణలో కనిపించడం లేదు. శుభ్రం చేయించాల్సిన అధికారులు కేవలం ప్రచారానికే పరిమితమై బ్యానర్లు పట్టుకొని జనాల్లోకి వెళుతున్నారు. బస్తీల మధ్యనే మురుగునీటి కంపు కారణంగా ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని వచ్చిన కార్మికుల ఆరోగ్యానికి రక్షణ లేకుండాపోయింది

జనావాసాల మధ్య మురుగు కుంటలు

ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడను పట్టణీకరణ చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడి పరిశ్రమల్లో పని చేస్తూ స్థానికంగా నివాసముంటున్నారు. పట్టణంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 32వేలుండగా ప్రస్తుతం 80 వేల వరకు జనాభా ఉంటుందని అంచనా వేస్తున్నారు. బస్తీలు, కాలనీలు పుట్టుకువచ్చాయి. జనావాసాల మధ్య ఆరు వరకు కుంటలు ఉన్నాయి. వాటిని పూర్తిగా మురుగునీటి పరివాహక ప్రాంతంగా అధికారులు వినియోగిస్తున్నారు. కుంటల చుట్టుపక్కల నివాసముండే ప్రజలు మురుగు నీటిని కుంటల్లోకి పంపేలా పైపులైన్ నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా నిత్యం మురుగు కంపు భరిస్తూ నివాసం ఉంటున్నారు.

వ్యాధులబారిన బస్తీవాసులు

కాలుష్య కారక వాతావరణంలో కార్మికుల కుటుంబసభ్యులకు ఉదర సంబంధం వ్యాధులు వచ్చి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కాలనీల్లో అద్దెలు భారంగా మారకూడదన్న భావనతో బస్తీల్లో అద్దెకు నివాసం ఉంటున్నారు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మికుల్లో వ్యాధులు ప్రబలడంతో బతుకులు భారంగా మారుతున్నాయి. స్థానికంగా బస్తీదవాఖానా, ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రాలు, ఈఎస్ఐ ఆసుపత్రులు నిత్యం కిటకిటలాడుతున్నాయి.

విధుల్లో 40 మంది కార్మికులే..

మున్సిపల్ పట్టణంలో 67 మంది కార్మికులు పని చేయాల్సి ఉండగా 40 మంది పని చేస్తున్నారు. మిగిలిన 27 మంది పూర్తిస్థాయి విధులకు హాజరుకావడం లేదు. రోడ్లపై చెత్తను తీసుకువెళ్లేందుకు 12 రిక్షాలు, ఇంటింటికీ చెత్తను సేకరించడానికి 14 ఆటోలు పని చేస్తున్నాయి. 8 వరకు రిక్షాలు పాత పంచాయతీ కార్యాలయ భవన ప్రాంగణంలో మూలకు చేరాయి. వాటిని మరమ్మతులు చేయించకుండా అలానే వదిలేశారు. రోడ్ల పక్కన చెత్త వేయకుండా ఉండటానికి ఏర్పాటు చేయాల్సిన చెత్తడబ్బాలు సైతం పాడుబడిన రిక్షాలతో పడేశారు.

ప్రశ్నార్థకంగా పారిశుధ్యం

రోడ్లపక్కన వ్యర్థాలు శుభ్రం చేయకుండా అలానే వదిలిపెడుతున్నారు. కుంటల్లో మురుగు నీటితో పాటు వ్యర్థాలు సైతం పారబోస్తున్నారు. కుంటల పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు దుర్గంధాన్ని నిత్యం పీలుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. నివాసితులు నిరుపేదలు కావడం, ఇతర రాష్ట్రాల వారు కావడం వల్ల కుంటల్లో వ్యర్థాలు పారబోస్తున్నా నిరోధించలేక అలానే ఉండిపోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో, కుంటల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామనే హెచ్చరికలు కూడా అధికారులు జారీ చేయలేదు.



మరమ్మత్తుకు నోచుకోని రిక్షాలు

పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

నారాయణఖేడ్/మనూరు,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లితో పాటు మనూరు మండలం దుద్దగొండ గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విడతల వారీగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఈఈ తివారి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్, మనూరు ఎంపీడీవో చంద్రశేఖర్, నాయకులు తదితరులు ఉన్నారు. కాగా మనూరు మండలం తుమ్నూరుకు చెందిన రామచంద్రారెడ్డికి రూ.60 వేలు, విఠల్‌కు రూ.6,500సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నారాయణఖేడ్‌లో అందజేశారు.

మంజీరాపై బ్రిడ్జి నిర్మాణానికి పరిశీలన

నారాయణఖేడ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మంజీరా నదిపై బ్రిడ్జి కం డ్యామ్ నిర్మాణానికి రిటైర్డు ఎస్ఈ యేసయ్య, డీఈ విఠల్‌రావు, ఖేడ్ ఇరిగేషన్ డీఈ జలందర్‌లతో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోమవారం పరిశీలించారు. మనూరు మండలం రాయిపల్లి వద్ద వంతెన, డ్యాం నిర్మాణానికి సంబంధించి అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా తాగు, సాగు నీటి అవసరాలు అధికంగా మంజీరాపై నదిపై ఆధారపడి ఉండడంతో ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టిన పక్షంలో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఉండవని నిర్ధారించారు. దీనికి తోడు వ్యవసాయానికి సైతం నీటిని వాడుకునే అవకాశం ఉండనుంది. ఇందుకు సంబంధించిన స్థల పరిశీలన చేపట్టారు. అధికారుల నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు.



మనూరు మండలం రాయిపల్లి వద్ద ఇంజనీరింగ్ అధికారులతో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో తీరిన తాగునీటి కష్టాలు

కోహీర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'ఊరి ముంగిట చెరువు.. తాగునీటికి కరువు' అనే శీర్షికన ఈ నెల 17న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి తాగు నీటి బోర్లను మరమ్మతు చేయించారు. కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలో ప్రజలు, పీచేర్యాగడి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలపై ప్రచురితమైన కథనాలకు స్పందించిన అధికారులు పీచేర్యాగడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పాడైన బోరును బాగు చేయించారు. అలాగే బడంపేట గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలో పాడైన తాగు నీటి బోర్లను బాగు చేయించారు.

- కంగ్టి : జంగి.బి లో తాగునీటి తిప్పలపై ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. చేతి పంపు, త్రీ ఫేస్ మోటారు పని చేయడం లేదని, దీంతో మిషన్ భగీరథ నీరు రాకుంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలుసుకున్నారు. ఈ మేరకు సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేతి పంపుకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తెచారు. కాగా తాగునీటి ఇక్కట్లను వెలుగులోకి తెచ్చి తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ఆయా గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



కోహీర్‌మండలం బడంపేట, కంగ్టి మండలంలోని జంగి.బి గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

సంగారెడ్డి రూరల్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు సోమవారం జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. మూడు చక్రాల బండి (ట్రై సైకిళ్లు) అందజేయాలని అర్జీ పెట్టుకున్న తమకు కలెక్టర్ వెంటనే స్పందించి ఆదుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారిలకు ధన్యవాదాలు తెలిపారు.

శైవాలయాల్లో కార్తీక శోభ



కల్హేర్: నిజాంపేట మండలం బాచేపల్లి రామాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



హవేళిఘణపూర్: ముత్తాయికోట ఆలయంలో శివుడికి భక్తుల అభిషేకాలు



పెద్దశంకరంపేట: కోప్పోల్ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించడంతో పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలంలోని బాచేపల్లి రామాలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. కోహీర్ మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్న స్వామి దేవాలయంలో సోమవారం కోహీర్ మండల వీరశైవ లింగాయత్ సమాజం వారు కార్తిక మాస వనబోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండల పరిధిలోని ముత్తాయికోటలోని సిద్దేశ్వరాలయంలో గోవింద్ మహరాజ్ ఆధ్వర్యంలో శివుడికి భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కుంకుమార్చనలు, శనేశ్వరపూజలు చేశారు. పెద్దశంకరంపేట మండలంలోని కొప్పోలు ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో, గొట్టిముక్కుల ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో, గురుపాదుగుట్ట ఆలయంలో సైతం భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేగుంట మండలం ఉల్లితిమ్మాయిపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి విశేషమైన శత రుద్ర పూర్వక అభిషేకము ఘనంగా నిర్వహించారు.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

చిన్నశంకరంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో శ్రీరామ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ల్యాబ్, మందుల స్టోర్ రూమ్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వైశాలి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవ్య, పీహెచ్‌వో యాదగిరి రావు, మెడికల్ సూపరింటెండెంట్ నిర్మల, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాలి

- ఉమ్మడి జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్

నాగల్‌గిద్ద, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్ష రాస్యులైన స్వయం సహాయక సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సీసీలు, వీవోఏలదేనని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాగల్‌గిద్ద ఐకేపీ భవనంలో అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్పందన దుర్గ, ఐకేపీ ఏపీఎం నర్సింలు, మహిళా సంఘాల సమైక్య మండల సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఐదు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు



రామచంద్రాపురం జాతీయ రహదారిపై పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున పాదచారులు రోడ్డు దాటేందుకు ఐదు ఫుట్‌ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డిలతో కలిసి రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు ఎక్కడ రావాలనే దానిపై మ్యాప్‌లతో పరిశీలన చేశారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అశోక్ నగర్, బీరంగూడకమాన్, రామంద్రాపురం రైల్వేలైన్, పటాన్‌చెరు బస్టాండు, సాకిచెరువు ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ వంతెనలు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ లాలూనాయక్, ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

రామచంద్రాపురం టౌన్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామం ప్రభుత్వ పాఠశాలను విద్యాశాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి రమేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను చదువుపై వివరాలు అడిగారు. అనంతరం డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడుతూ పాఠశాలల్లో పరిశుభ్రత, సుందరీకరణ వంటి కార్యక్రమాలను నిత్యం చేస్తుండాలన్నారు. జిల్లాలో 10 మండలాల్లో ఎంపిక చేసిన 10 పాఠశాలల్లో తనిఖీలు చేస్తామని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రధానోపాధ్యాయులపై చర్యలు ఉంటాయని వివరించారు.

పంచాయతీ ట్రాక్టర్.. ప్రైవేట్ పనులు



మునిపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ట్రాక్టర్‌ను ఓ నాయకుడు సొంతపనులకు వినియోగించుకోవడం మండలంలోని చిన్నచెల్మెడ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. చిన్నచెల్మెడ గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు తన పైపులను పొలానికి తీసుకెళ్లేందుకు ఊర్లో ట్రాక్టర్లు దొరకలేదేమో.. ఏకంగా పంచాయతీ ట్రాక్టర్‌నే వాడుకున్నాడు.. గ్రామం శివారులోని తన వ్యవసాయ పనులకు జీపీ ట్రాక్టర్‌లో పైపులను సోమవారం వేసుకొని వెళ్లడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. అధికార పార్టీ నాయకుడు ఇష్టారీతిన ట్రాక్టర్‌ను వినియోగించుకున్నా పంచాయతీ అధికారులుపట్టించుకోకపోవడం గమనార్హం. మండలంలోని కొన్ని గ్రామాల్లో చెత్తా చెదారం కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వస్తున్నా, ట్రాక్టర్‌లో డీజిల్ లేదంటూ చెప్పే అధికారులు కాంగ్రెస్ నాయకుడి తీరుపై మిన్నకుండిపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రామచంద్రాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ రైల్వేలైన్ వద్ద సోమవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో హరిప్రసాద్ కథనం ప్రకారం.. తెల్లాపూర్-లింగంపల్లి మధ్యలోని 159/19-23 కిలోమీటరు వద్ద 40 ఏళ్ల వయస్సున్న వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనపర్చుకున్నామన్నారు. మృతుడి తల భాగం మాంసంముద్దగా మారిందని, బ్లూ జీన్స్, గోధుమ రంగు టీషర్టు ధరించి ఉన్నాడని చెప్పారు

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

రామచంద్రాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో కొల్లూరు పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. సీఐ గణేష్‌పటేల్ కథనం ప్రకారం.. గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ గఫూర్(51), ఎండీ అర్షత్(20), హఫీజ్‌పేట్‌కు చెందిన ఎండీ మహబూబ్(34) కర్ణాటకలోని బీదర్ నుంచి గంజాయిని తీసుకుని వస్తూ ముత్తంగి వద్ద బస్సు దిగి, ఆటోలో గోపన్‌పల్లి వైపు బయలుదేరారు. పక్క సమాచారం మేరకు వారిని కొల్లూరు పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇసుక వేలం

చేగుంట ,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):నార్సింగి శివారులో ఇటీవల సీజ్ చేసిన 15 ట్రాక్టర్ల ఇసుక డంపును మైనింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం బహిరంగంగా వేలంపాట నిర్వహించారు. తహసీల్దార్ గ్రేస్ బాయి, ఎస్ఐ సృజన, పర్యవేక్షణలో బహిరంగంగా వేలం వేశారు. గ్రామానికి చెందిన బొల్ల రాకేష్ రూ.1,99, లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమం లో ఎంపీడీవో ప్రీతి రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మందు బాబుల అడ్డాగా సర్కారు బడి

హత్నూర, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర బాలుర పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. సెలవు దినం వచ్చిందంటే పగలు, రాత్రి అని తేడా లేకుండా పాఠశాల తరగతి గదుల పక్కనే మద్యం తాగుతూ పాఠశాల పరిసరాలను కంపు చేస్తున్నారు. ఆ మరునాడు ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్లే మందుబాబులకు అడ్డాగా మారి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాఠశాలకు ప్రహరీ నిర్మించి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



హత్నూర బాలుర పాఠశాల ప్రాంగణంలో మద్యం సీసాలు

వైద్యకళాశాల భవనంతో మరింత అభివృద్ధి



వైద్యకళాశాల భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో మెదక్ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా నాటి ముఖ్యమంత్రి మెడికల్ కళాశాల విషయంలో మాయ మాటలు చెప్పి మోసం చేసిండ్రని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావ్ విమర్శించారు. పట్టణ శివారు 890 సర్వే నెంబరులో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 180 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వైద్యకళాశాల భవన నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ కళాశాలతో పాటు పారామెడికల్, నర్సింగ్ కళాశాలలు మంజూరు చేయించామన్నారు. నూతన వైద్య కళాశాలతో జిల్లా మరింత అభివృద్ధి చెందనుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ నితిన్ కాబ్రా, సూపరింటెండెంట్ సునీత, డీసీహెచ్ఎస్ శివదయాల్, ఎంసీహెచ్‌వోడీ రాజశ్రీ, ప్రొఫెసర్లు, నాయకులు పాల్గొన్నారు

- **పాపన్నపేట:** మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి, లింగాయపల్లి - చీకోడ్ గ్రామాల్లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు పశువైద్యశాలలను ఎమ్మెల్యే రోహిత్‌రావ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ నేపథ్యంలో రోజు రోజుకు కనుమరుగవుతున్న పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.


బాల్య వివాహాలు నేరం: సీడీపీవో

చిన్నశంకరంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని రామాయంపేట సీడీపీవో స్వరూప రాణి అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, చేయడం ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైన గ్రామాల్లో బాల్య వివాహాలు జరిపితే సంబంధిత అధికారులకు 100 డయల్ ద్వారా కాల్ చేయాలని సూచించారు. అలాగే బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణగౌడ్, తహసీల్దార్ ప్రభుదాస్, ఎంఈవో పుష్పవేణి, పీహెచ్‌వో యాదగిరిరావు, విజన్ ఎన్‌జీవో యాదగిరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి బాటలు వేసింది సీపీఐ

సంగారెడ్డి రూరల్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటానికి సీపీఐ బాటలు వేసిందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా బాసరలో ప్రారంభమైన సీపీఐ ప్రచార జాత సోమవారం సంగారెడ్డికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన ఆంధ్రమహాసభ సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలో ఏర్పడిందని గుర్తు చేశారు. సీపీఐ పార్టీకి ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రత్యేక బంధం ఉన్నదన్నారు. కార్యక్రమంలో బస్సు జాత రాష్ట్ర అధ్యక్షుడు వలీఫుల్లా ఖాద్రీ, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి రాజేంద్ర ప్రసాద్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సన్మానం



మునిపల్లి మండల జర్నలిస్టులను సన్మానిస్తున్న పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్

మునిపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని పీఆర్ఎస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి పేర్కొన్నారు. జాతీయ జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా పీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పోల్కంపల్లి - ఖమ్మంపల్లి గ్రామ శివారులో గల పీఆర్ఎస్ గార్డెన్‌లో జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల అభివృద్ధి కోసం పీఎస్ఆర్ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు గడ్డం భాస్కర్, రైతు బంధు మాజీ అధ్యక్షుడు పరశురాం, సీనియర్ నాయకులు రామక్రిష్ణ, బాగయ్య, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి మల్లేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల గోసను పట్టించుకోరా?

మునిపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సీసీఐ తీసుకువచ్చిన కొత్త నిబంధనలతో పత్తి రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ పేర్కొన్నారు. పత్తి రైతుల గోసను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం మండలకేంద్రంలో సాయికుమార్ పార్టీ నాయకులతో కలిసి స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు.